మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్

ఫిర్యాదులపై సా...గదీత

- బాధితులకు జరగని న్యాయం
- పైగా ఉచిత సలహాలు ఇస్తున్న పోలీసులు
- స్టేషన్ల చుట్టూ తిరుగుతున్న బాధితులు

కరీమాబాద్, మార్చి 9: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఉన్నతాధికారులు చెబుతున్నా సిబ్బంది మాత్రం ఆచరణలో చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 'అయ్యా.. నాకు న్యాయం చేయాలి' అంటూ ఫిర్యాదు చేసేందుకు స్టేషన్‌కు వస్తే చాలు.. విచారణ పేరుతో కేసులను పెండింగ్‌లో పెడుతూ పోలీసులు పబ్బం గడుపుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో చెప్పులు అరిగేలా స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నామని బాధితులు వాపోతున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టుకు పంపించాలని, అక్కడైనా తేల్చుకుంటామని వేడుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితులు ఫిర్యాదు చేస్తే చాలు.. నిందితులను స్టేషన్‌కు పిలిపించి నయానో.. భయానో మాట్లాడుకోవడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే.. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో కేసులు పెట్టేందుకు వెళ్లిన వారే అరిగోస పడుతున్నట్లు చర్చించుకుంటున్నారు.

ఫిర్యాదు చేసి పది నెలలు గడిచినా..

భూ వివాదంలో ఖిలావరంగల్‌కు చెందిన ఓ వ్యక్తి ఫిర్యాదు చేసి దాదాపు పది నెలలు గడుస్తున్నా నేటికీ విచారణ పూర్తి కాలేదు. దీంతో సదరు వ్యక్తి స్టేషన్ చుట్టూ తిరుగుతున్నాడు. పైగా కూర్చొని మాట్లాడుకోవాలని ఉచిత సలహా సైతం ఇచ్చినట్లు సమాచారం. దీంతో బాధితుడు సీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. అలాగే, ఓ తల్లి తన కొడుకు డబ్బులు లాక్కున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. అమ్మా.. నీకు న్యాయం చేస్తామని చెప్పిన అధికారి బాధితుడిని స్టేషన్‌కు పిలిచి మాట్లాడాడు. తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ.. మరుసటి రోజు నుంచి అధికారి మాటలో తేడా వచ్చిందని తల్లి పేర్కొంది. కుటుంబ విషయంలో కేసు ఎందుకని, పెద్ద మనుషుల సమక్షంలో మాట్లాడుకోవాలని సూచించినట్లు తెలిసింది. దీంతో బాధితురాలు సైతం సీపీకి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి

కరీమాబాద్‌లో ఓ వ్యక్తి తనను కొట్టాడని ఫిర్యాదు చేస్తే.. అతడికి కూడా ఉచిత సలహా ఇచ్చినట్లు భోగట్టా. ఇటీవలే ఓ భూ వివాదంలో బాధితుడు కోర్టును ఆశ్రయించగా, వివరణ ఇవ్వాలని కోర్టు మిల్స్‌కాలనీ పోలీసులను కోరిన విషయం తెలిసిందే. తాజాగా శివనగర్ ప్రాంతంలోని భూ వివాదంలో ఫిర్యాదు చేసిన బాధితుడు సైతం తిరిగి కోర్టును ఆశ్రయించగా.. ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోర్టు ఆదేశించినట్లు సమాచారం. తన భూమిలో అక్రమ నిర్మాణం చేపట్టిన వ్యక్తే తనను బెదిరిస్తున్నాడని ఓ వృద్ధుడు ఫిర్యాదు చేస్తే తనను స్టేషన్ చుట్టూ తిప్పుకుంటున్నారని తెలిసింది. ఇలా చెప్పుకుంటూ పోతే మిల్స్‌కాలనీ పోలీసుల లీలలు కోకొల్లలు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి న్యాయం జరిగేలా చూడాలని బాధితులు కోరుతున్నారు.

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం

- ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయినా పట్టించుకోని వైనం
- ఎడ్లబండిలో తీసుకొచ్చి బిగుంచుకున్న రైతులు

పర్వతగిరి, మార్చి 9: మండలంలోని ఇస్లావత్ తండాలో 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో రైతులు ఇబ్బంది పడ్డారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా వారు సకాలంలో స్పందించలేదు. దీంతో చేసేదేమీ లేక రైతులే స్వయంగా ఎడ్లబండిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకెళ్లి పర్వతగిరి సబ్‌స్టేషన్‌కు చేర్చారు. అనంతరం మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసుకొచ్చి వారే బిగించుకున్నారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోవడంతోనే ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు మోటర్లు కాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరుతున్నారు.

ఎడ్లబండిలో తీసుకొచ్చిన ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించుకుంటున్న రైతులు

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★OT-TECHNICIANS (Exp.), PHARMACY (Exp.), LAB-TECHNICIANS (Exp.), DHOBI Worker & Computer Operators. Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm.
NTW-488

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్‌రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

రేషన్.. పరేషాన్

- బియ్యం కోసం ఎదురుచూపులు
- మూడు మండలాల్లో సరఫరాలో తీవ్ర జాప్యం
- ఆరు నెలలుగా ఇదే పరిస్థితి
- ఆందోళనలో డీలర్లు, వినియోగదారులు

ఖిలావరంగల్, మార్చి 9: పీడీఎస్ బియ్యం కోసం డీలర్లు, ప్రజలు పరేషాన్ అవుతున్నారు. ప్రతి నెల ఒకటవ తేదీ నుంచి రేషన్ షాపులకు అందాల్సిన బియ్యం నెలాఖరుకు చేరుతున్నాయి. రైస్ అలాట్మెంట్‌కు సివిల్ సప్లయ్ సిబ్బంది, రేషన్ కోటాకు డీలర్లు, బియ్యం కోసం లబ్ధిదారులు ఇలా ఎవరికి వాళ్లకు ఎదురుచూపులు తప్పడం లేదు. సివిల్ సప్లయి ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆరు నెలలుగా బియ్యం సరఫరాలో జాప్యం జరుగుతున్నది. ముఖ్యంగా వరంగల్, ఖిలా వరంగల్, గీసుగొండ మండలాల్లో రేషన్ బియ్యం ఆలస్యంగా పంపిణీ అవుతున్నది. అలాట్మెంట్ ఆలస్యం కావడంతో ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద సివిల్ సప్లయి సిబ్బందికి, డీలర్లకు, అలాగే రేషన్ దుకాణాల్లో బియ్యం ఇవ్వకపోవడంతో వినియోగదారులు, డీలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంటున్నది. ఎనుమాముల మార్కెట్‌లోని బఫర్ గోదాంలోని ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి ప్రతి నెల ఈ మూడు మండలాల్లోని 192 రేషన్ దుకాణాలకు పీడీఎస్ బియ్యం సరఫరా చేస్తారు. ఇందులో వరంగల్ మండలానికి 8,700 క్వింటాళ్లు, ఖిలా వరంగల్‌కు 8,700 క్వింటాళ్లు, గీసుగొండకు 2600 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రతి నెల 20 నుంచి 1వ తేదీ వరకు డీలర్లకు సరఫరా చేయాల్సి ఉంటుంది. అలాగే డీలర్లు 1 నుంచి 15వ తేదీ వరకు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయాలనే నిబంధనలున్నాయి. అయితే బఫర్ గోదాంలో స్టాక్ లేకపోవడంతో రేషన్ షాపుల కు బియ్యం సరఫరా నెలాఖరు వరకు చేరుతున్నదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం ఎప్పుడిస్తారో చెప్పాలంటూ వినియోగదారులు నిలదీస్తున్నారని పేర్కొంటున్నారు.

ఆరు లారీలకు రెండింటితోనే సరఫరా..

బఫర్ గోదాంలో 40 శాతం నిల్వలు ఉన్నప్పుడు రోజుకు అదనంగా ఆరు లారీల పీడీఎస్ బియ్యం సరఫరా చేయాల్సి ఉంటుంది. అయితే, గోదాం ఖాళీగా ఉండడంతో రోజు రెండు లారీలు మాత్రమే వస్తుండడంతో వాటిని 192 షాపులకు సరఫరా చేయడం సాధ్యం కావడం లేదు. ఒక డీలరుకు ఒకేసారి కోటాను అందించాల్సి ఉండగా స్టాక్ లేకపోవడంతో రెండు సార్లు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. లారీలు రావడంతో డీలర్లు మాకే ఇవ్వాలంటూ సిబ్బందితో వాగ్వాదానికి దిగుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత బియ్యం సరఫరాపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సకాలంలో బియ్యం అందడం లేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 15 రోజుల్లో రేషన్‌షాపుల్లో బియ్యం పంపిణీ పూర్తి చేయాల్సి ఉండగా నెల రోజులు ఎదురు చూడాల్సిన వస్తున్నదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి సకాలంలో బియ్యం పంపిణీ జరిగేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలి

కరీమాబాద్, మార్చి 9: మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రంగయ్య డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మామునూరు ఎయిర్‌పోర్టును సందర్శించారు. ఈ సందర్భంగా రంగయ్య మాట్లాడుతూ ఎయిర్‌పోర్టు భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలన్నారు. ఎయిర్‌పోర్టు నిర్మాణంతో జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. కాలయాపన చేయకుండా వెంటనే పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అరూరి కుమార్, బషీర్, దుర్గయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

పర్వతగిరి, మార్చి 9: ఎస్సారెస్పీ కెనాల్ వద్ద ఇరువైపులా వాహనదారులకు కనిపించేలాగా ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరారు. మండలంలోని కొంకపాక శివారు నుంచి తీగరాజ్‌పల్లికి వెళ్లే వరంగల్ ప్రధాన రహదారిలో కాల్వ ఉండగా, తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారి నుంచి వెళ్లే వాహనదారులకు కనిపించేలా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

నేటి నుంచి ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

గిర్మాజీపేట, మార్చి 9: ఇంటర్ వార్షిక పరీక్షల మూల్యాంకనం ప్రక్రియ సోమవారం సంస్కృతం సబ్జెక్టుతో ప్రారంభిస్తున్నట్లు డీఐఈవో శ్రీధర్‌సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది నుంచి వరంగల్, ములుగు, మహబూబాబాద్ జిల్లాలకు నూతన స్పాట్ వాల్యూయేషన్ కేంద్రాన్ని వరంగల్ ఎల్బీ కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మూల్యాంకన కేంద్రంలో స్ట్రాంగ్ రూమ్ గదులు, మూల్యాంకన గదులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు స్పాట్ క్యాంపునకు హాజరయ్యే అధ్యాపకులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు.

గంగదేవిపల్లిని సందర్శించిన విద్యార్థులు

గీసుగొండ, మార్చి 9: జాతీయ ఆదర్శ గ్రామమైన గంగదేవిపల్లిని ఆదివారం గుజరాత్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్‌తోపాటు ఏడు రాష్ట్రాల 8వ తరగతి విద్యార్థులు జాతీయ మానవ హక్కుల కమిటీ బృందం ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిని స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శిక్షణ మేనేజర్ కూసం రాజమౌళి విద్యార్థులకు గ్రామాభివృద్ధిని వివరించారు. ప్రజలు, ప్రభుత్వ భాగస్వామ్యంతోనే గ్రామాన్ని సంపూర్ణంగా అభివృద్ధి చేసినట్లు తెలిపారు.

పన్ను వసూళ్లలో పురోగతి సాధించాలి: కమిషనర్

వరంగల్, మార్చి 9 : పన్ను వసూళ్లలో పురోగతి సాధించాలని కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే అన్నారు. నగరంలో ఆదివారం ఆమె పన్ను వసూళ్ల తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎస్‌బీఐ కాలనీ, టీఎన్జీవోస్‌కాలనీలో పర్యటించారు. పన్నులు చెల్లించని కమర్షియల్, రెసిడెన్షియల్ యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. అయినా స్పందించని యాజమాన్యాల ఆస్తులను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. పన్ను వసూలు చేసే సిబ్బంది నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. దీంతోపాటు ట్రేడ్ లైసెన్స్, ప్లాస్టిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం పనితీరును కమిషనర్ పరిశీలించారు. కూరగాయల మార్కెట్ ప్రాంతంలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్లను తెలుసుకున్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్న షాపుల ఫొటోలను పరిశీలించారు. నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టేలా ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు పని చేయాలన్నారు. తనిఖీల్లో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఆర్‌వో యూసుఫొద్దీన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, ఆర్ఐ నవనీత్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్ల తీరును పరిశీలిస్తున్న కమిషనర్

ఫోర్త్ క్లాస్ ఉద్యోగులకు ప్రమోషన్లు కల్పించాలి

వర్ధన్నపేట సమితి అధ్యక్షుడు రవీందర్

వర్ధన్నపేట, మార్చి 9: ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన జీవో నంబర్ 6లో ఆఫీస్ సబార్డినేట్, నైట్ వాచ్‌మెన్ పోస్టులను న్యూమరైజ్ చేస్తూ కారుణ్య నియామకంలో జూనియర్ అసిస్టెంట్లుగా నియమించడం వల్ల తెలంగాణ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతున్నదని ఫోర్త్‌క్లాస్ ఎంప్లాయీస్ వర్ధన్నపేట సమితి అధ్యక్షుడు కొత్తపల్లి రవీందర్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. డిగ్రీలు పూర్తి చేసిన అనేక మంది నాలుగో తరగతి ఉద్యోగులు 25 ఏళ్లుగా ప్రమోషన్ల కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేవారు. కానీ, ఉన్నతాధికారులు జూనియర్ అసిస్టెంట్ పోస్టులకు ఖాళీలు లేవని ఆఫీస్ సబార్డినేట్ మాత్రమే ఖాళీలు చూపించడంతో కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగంలో కొనసాగుతున్నారన్నారు. ఇతర డిపార్ట్‌మెంట్ల నుంచి వచ్చిన వారికి మాత్రం జూనియర్ అసిస్టెంట్లుగా నియమిస్తూ సర్వీస్‌లో ఉన్న ఆఫీస్‌ల్లో పని చేస్తున్న వారికి తీరని అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇప్పటికైనా జీవో నంబర్ 6ను తొలగించి తమకు కూడా న్యూమరైజ్ పోస్ట్ చేసి అర్హతను బట్టి ప్రమోషన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో వర్ధన్నపేట సమితి కార్యదర్శి మునుకుంట్ల వెంకటేశ్వర్లు, అసోసియేట్ అధ్యక్షుడు ఎండీ జావేద్, ఉపాధ్యక్షుడు కంచర్ల ప్రభుదాస్, కో ఆప్షన్ సభ్యుడు గాయల సుమన్, మహిళా అధ్యక్షురాలు అరుణ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ స్కాంపై సీబీఐకి ఫిర్యాదు

మాట్లాడుతున్న మొగిలిచర్ల సుదర్శన్

ఖిలావరంగల్, మార్చి 9: వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల్లో జరిగిన సీఎంఆర్ స్కాంపై సీబీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్నట్లు వినియోగదారుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ అన్నారు. శివనగర్‌లో ఆదివారం వరంగల్ ఉమ్మడి జిల్లా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంతమంది రైస్ మిల్లర్లు కోట్లాది రూపాయల దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. వీరిపై కేసులు నమోదు చేసినా చర్యలు శూన్యమని విమర్శించారు. ప్రజాప్రతినిధులు, కొంతమంది ఉన్నతాధికారుల అండదండలు ఉండడం వల్ల సంబంధిత మిల్లులపై చర్యలు తీసుకోకుండా వారికే సీఎంఆర్ వడ్లు కేటాయించారని ఆరోపించారు. ఈ నెల 25న ఢిల్లీలోని సీబీఐ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని తీర్మానించినట్లు చెప్పారు. సమావేశంలో న్యాయవాదులు మురారిశెట్టి యశ్వంత్ కుమార్, రంగరాజు, ఆనందరావు, రాయబారపు భిక్షపతి, బండి అనిల్‌కుమార్, మృధుల, సమాఖ్య సభ్యులు చిలువేరు ప్రవీణ్‌కుమార్, రాజేశ్, భార్గవ్, రంజిత్ పాల్గొన్నారు.

'నూతన విద్యా విధానంతో పొంచి ఉన్న ప్రమాదం'

ప్రతిజ్ఞ చేస్తున్న డీటీఎఫ్ నూతన కమిటీ

నర్సంపేట, మార్చి 9: నూతన విద్యా విధానంతో విద్యా రంగంలో ప్రమాదం పొంచి ఉందని, దీన్ని ప్రతిఘటించాల్సిన అవసరం విద్యాభిమానులపై ఉందని డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాకయ్య అన్నారు. పట్టణంలోని హనుమాన్ దేవాలయ పాఠశాలలో ఆదివారం డీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంతో సామాన్యులకు విద్య అందని పరిస్థితులు ఉన్నాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా విద్యా విధానం ఉందని, దీన్ని ప్రతి విద్యావంతుడు వ్యతిరేకించాలని కోరారు. అనంతరం డీటీఎఫ్ నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎస్‌కే సర్దార్, ప్రధాన కార్యదర్శిగా కొత్ర రమేశ్, జిల్లా కౌన్సిలర్లుగా దార్ల రవీందర్, విజయ, కొమురయ్య, రఘుపతి, మండల ఉపాధ్యక్షుడిగా విజయ, వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా రాజేందర్, గుగులోత్ భిక్షపతి, శోభన్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

'కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలి'

గీసుగొండ, మార్చి 9: గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడు ఆడెపు రమేశ్ డిమాండ్ చేశారు. పోస్టుకార్డు ఉద్యమంలో భాగంగా గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచెర్లలో ప్రభుత్వానికి కార్డులు పోస్టు చేశారు. ఉద్యమకారులకు నెలకు రూ. 25 వేల పెన్షన్ ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అలాగే, 250 గజాల ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారని తెలిపారు. హామీలు అమలు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు శివమార్, ప్రసాద్, రమేశ్, మల్లికార్జున్ పాల్గొన్నారు.


ప్రభుత్వానికి కార్డులు పోస్టు చేస్తున్న ఉద్యమకారులు

హైదరాబాద్‌కు తరలిన పద్మశాలీలు

జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న మేయర్

పోచమ్మమైదాన్/కాశీబుగ్గ, మార్చి 9: హైదరాబాద్ నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన పద్మశాలీల మహాసభకు ఓరుగల్లు నుంచి వందలాది మంది తరలివెళ్లారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి జెండా ఊపి వాహనాలను కొత్తవాడ గోపాల స్వామి గుడి జంక్షన్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ వడ్నాల నరేందర్, జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు కుసుమ సతీశ్, కార్పొరేటర్లు గుండేటి నరేంద్రకుమార్, గుండు చందన పూర్ణచందర్, కార్యదర్శి గోరంటల రాజు, గుండు కామేశ్వర్, నందాల చందర్‌బాబు, యెలగం సత్యనారాయణ, బాసాని శ్రీనివాస్, బైరి శ్యామ్‌సుందర్, సుధాకర్, మాటేటి అశోక్, మాచబత్తుల కుమార్, మంత్రి కమలాకర్, కోటేశ్వర్, కృష్ణ, వేణు, రఘు, వెంటకేశ్వర్లు, రమేశ్ పాల్గొన్నారు. అలాగే, హైదరాబాద్‌లో జరిగిన అఖిల భారత పద్మశాలీ 17వ మహాసభకు కాశీబుగ్గ నుంచి పెద్ద ఎత్తున పద్మశాలీలు తరలివెళ్లారు. కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీ పట్టణ గౌరవ అధ్యక్షుడు, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, ప్రధాన కార్యదర్శి గోరంటల రాజు, వేముల నాగరాజు, వెలిశాల బాబు, మామిడి ఈశ్వరయ్య, గుర్రపు సత్యనారాయణ, అల్లి అజయ్‌బాబు, ఆకేన వెంకటేశ్వర్లు, సామాల వెంకటస్వామి, బొద్దుల కుమార్, ములుక సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా వాసవీ క్లబ్ సేవలు: అధ్యక్షుడు

వరంగల్‌చౌరస్తా, మార్చి 9: కులమత తారతమ్యాలు లేకుండా సేవే లక్ష్యంగా ప్రపంచవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థల్లో వాసవీ క్లబ్ ఒకటని ఇంటర్నేషనల్ వాసవీ క్లబ్ అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ అన్నారు. వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వరంగల్ విభాగం నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆదివారం డిస్ట్రిక్ట్ గవర్నర్ వేమిశెట్టి కిశోర్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ గుండా ప్రకాశ్‌రావు ముఖ్య అతిథుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా తొనుపునూరి వీరన్న, ప్రధాన కార్యదర్శిగా గన్ను సంపత్‌కుమార్, కోశాధికారిగా ఉప్పుల వెంకటేశ్వర్లు ప్రమాణం చేశారు. అనంతరం మొదటి సేవా కార్యక్రమంగా దేవన్నపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులకు పాలు, పెరుగు నిల్వ చేసుకోవడానికి అవసరమైన ఫ్రిడ్జి, 15 మంది పేద మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్‌ల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.


ప్రమాణం చేస్తున్న నూతన కార్యవర్గం

కలిమాబాద్: ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, నర్సంపేట: కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు, గీసుగొండ: ఆనందం వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

కరీమాబాద్/నర్సంపేట/గీసుగొండ, మార్చి 9: పూర్వ విద్యార్థులు ఒకచోట చేరి సందడి చేశారు. 1981-82 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు ఆదివారం మామునూరులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. అలాగే, నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి జడ్పీహెచ్ఎస్‌లో 2009-10 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శాన ఉమా మహేశ్వర్, రాజు, బాలాజీ, రాజ్‌పాల్, శ్రీలత, విజయశ్రీ పాల్గొన్నారు. అంతేకాకుండా గీసుగొండ మండలంలోని ఎలుకుర్తి జడ్పీహెచ్ఎస్ 1984-85 బ్యాచ్ ఎస్సెస్సీ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు పూర్వ విద్యార్థులు ప్రింటర్ బహూకరించారు.

రాష్ట్ర అధ్యక్షురాలు భారతి, మహిళలను సన్మానిస్తున్న నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ బాధ్యులు

ప్రతిభ చాటిన మహిళలకు సన్మానం

నర్సంపేట, మార్చి 9: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వల్లభ్‌నగర్ మినీ స్టేడియంలో ఆదివారం వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన, ఉద్యోగాల్లో స్థిరపడిన మహిళలను ఘనంగా సన్మానించారు. నర్సంపేట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు నల్లా భారతిరెడ్డి, మాజీ సర్పంచ్ కర్నాటి పార్వతమ్మ, ఏఎన్ఎం రజిత, ఆయేషాతోపాటు మరికొంత మంది ఉత్తమ మహిళలను శాలువాలు, జ్ఞాపికలతో సన్మానించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఆడెపు సదానందం, కోశాధికారి సంకినేని కృష్ణ, బాధ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని 13వ వార్డులో భారతి మహిళా మండలి ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షురాలు పెరుక కరుణ, పెండెం రాజేశ్వరి, కాంతమ్మ, గుర్రపు